ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 12 డిసెంబరు 2025 www.prajaswaramdaily.com 2 pm

# లేక్ షోర్ మాల్‌లో హీరో మనోజ్ సందడి



### నగరానికి ఇది ఐకానిక్ ల్యాండ్ మార్క్ : మనోజ్

హైదరాబాద్, ప్రజాస్వరం
హైదరాబాద్‌లో సరికొత్త లైఫ్‌స్టైల్ డెస్టినేషన్ అందుబాటులోకి వచ్చిందని, హీరో మనోజ్ అన్నారు. నగరంలోని వై జంక్షన్‌లో అత్యంత విశాలంగా, విలాసవంతంగా నిర్మించిన 'లేక్ షోర్ మాల్'ను ఆయన ప్రారంభించారు. తన మిత్రులైన ప్రణవ్ పూరి, అశ్విన్ పూరి ఇలాంటి ఒక అద్భుతమైన మాల్‌ను నగరానికి అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ రిటైల్, లైఫ్‌స్టైల్ రంగంలో ఈ మాల్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వరల్డ్ క్లాస్ షాపింగ్ అనుభూతిని అందించాలనే వారి విజన్‌ను మనోజ్ అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ, లేక్ షోర్ మాల్ నగర ప్రజలకు ఒక కొత్త షాపింగ్, వినోద అనుభూతిని అందిస్తుందని తెలిపారు. ఈ మాల్ హైదరాబాద్‌కు మరో ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.



# భవిష్యత్ లో సినిమా టికెట్ల రేట్లు పెంచం

### నిర్మాతలు, దర్శకులెవరూ మా వద్దకు రావొద్దు
### మాది పేదల ప్రభుత్వం వారికోసమే నిర్ణయాలు
### మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, ప్రజాస్వరం
భవిష్యత్‌లో సినిమా టికెట్ రేట్లు పెంచేది లేదని మంత్రి కోమటి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నిర్మాతలు, దర్శకులెవరూ మా దగ్గరకు రావొద్దు అని సూచించారు. మాది ఇందిరమ్మ ప్రభుత్వం.. పేదల కోసమే నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. హీరోలకు వందలకోట్ల రెమ్యునరేషన్లు ఎవరు ఇమ్మన్నారని ప్రశ్నించారు. కుటుంబాలతో సినిమాకు వెళ్లాలంటే తక్కువ ధరలుండాలని చెప్పారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. టికెట్ రేట్లు పెంచొద్దని గతంలోనే అనుకున్నామని, ఈసారి పొరపాటు జరిగింది అని మంత్రి తెలిపారు.

# నేనూ సీఎం అవుతా

### ఆ రోజు అందరి బండారాలు బయటపెడతా
### 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని అన్యాయాలపై ఆరా తీస్తా
### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్, ప్రజాస్వరం
తనకు ఎప్పుడో ఒకప్పుడు టైమ్ వస్తుందని, దేవుడి దయ ఉంటే ఏదొక ఓ రోజున తానూ ముఖ్యమంత్రిని అవుతానని, అప్పుడు 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని అన్యాయాలపై ఆరా తీస్తా. ఎందుకంటే ఈ అన్యాయాలపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిని దబాయించి, వారిపై బురద జల్లుతున్నారని, భయపెడుతున్నారని, నేను తప్పు చేయలేదని, ఎవరికీ భయపడనని, భగవంతుడు నాకు అవకాశం ఇచ్చినప్పుడు అన్ని బండారాలు బయటకు తీస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్‌తో అంటకాగుతున్నానని తనపై ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెకిలి ప్రయత్నాలు చేస్తున్న గుంట నక్కలు జాగ్రత్త అంటూ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్‌తో పాటు ఎవరినైనా ఒక్క పనైనా అడిగామా అని ప్రశ్నించారు. దమ్ముంటే తన ఆరోపణలకు సమాధానం ఇవ్వాలని సవాల్ విసిరారు. తనకు ఎవరితోనూ అవగాహన లేదు, వ్యాపారాలు లేవని తెలిపారు.

### మాధవరం కృష్ణారావుకు నోటీసులు పంపుతున్నా

ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావుకు కూడా నోటీసులు పంపుతున్నానని కవిత చెప్పారు. వారంలోగా క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తానన్నారు. ఏవీ రెడ్డితో పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి భూలావాదేవీలు ఉన్నాయని ఆరోపించిన ఆమె, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పొద్దున లేస్తే కేటీఆర్ వద్ద ఉంటారని చెప్పారు. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఎవరి బినామీనో చెప్పాలన్నారు. మాధవరం కృష్ణారావు చాలా చిన్న వ్యక్తి, అతని వెంట ఉండి గుంట నక్క ఆడిస్తోందన్నారు. కృష్ణారావు బాధితులు చాలా మంది తనకు ఫోన్లు చేస్తున్నారని కవిత వివరించారు. ప్రణీత్, ప్రణవ్ కంపెనీల్లో కృష్ణారావు కుమారుడు డైరెక్టర్‌గా ఉన్నారని చెప్పారు. ప్రణీత్, ప్రణవ్ కంపెనీల విల్లాలు అన్నీ కబ్జాల్లో కట్టినవేనని విమర్శలు చేశారు.

# అల్లూరి జిల్లాలో యాత్రికుల బస్సు బోల్తా

### లోయలో పడిన యాత్రికుల బస్సు, 8 మంది యాత్రికులు దుర్మరణం
### భద్రాచలం నుంచి అన్నవరం వెళ్తుండగా ఘటన

(ఆంధ్ర)



అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన 35 మంది యాత్రికులు, ఇద్దరు డ్రైవర్లతో ఓ ప్రైవేటు బస్సు భద్రాచలంలో దర్శనం ముగించుకుని అన్నవరం బయలుదేరింది. చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులోని రాజుగారిమెట్ట వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 37 మంది ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న చింతూరు పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలిస్తున్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో యాత్రికుల బంధువుల స్వస్థలమైన చిత్తూరు జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# లొంగిపోయిన ప్రభాకర్‌రావు



### జూబ్లీహిల్స్ పీఎస్ కు చేరుకున్న మాజీ ఐపీఎస్
### ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణకు సుప్రీంకోర్టు అనుమతి

హైదరాబాద్, ప్రజాస్వరం
తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు ఈ రోజు సిట్ ఎదుట లొంగిపోయారు. ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు వెళ్లిన ప్రభాకర్ రావు.. సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. నిన్న సుప్రీంకోర్టులో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా సిట్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ప్రభాకర్ రావు విచారణకు సహకరించడం లేదని, మొబైల్, ల్యాప్ టాప్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను మెమరీ మొత్తం డిలీట్ చేసి అప్పగించారని పేర్కొన్నారు. ఆయన నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రభాకర్ రావును కస్టోడియల్ విచారణకు అప్పగించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అత్యున్నత న్యాయస్థానం.. వారం రోజుల కస్టోడియల్ విచారణకు అనుమతినిచ్చింది. ఆ తర్వాత వచ్చే రిపోర్టుపై మళ్లీ విచారణ చేస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభాకర్ రావుకు భౌతికంగా ఎలాంటి హాని జరగకుండా చూడాలని, చట్టప్రకారం దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించింది.


# 95 బంతుల్లో 171 రన్స్

### వైభవ్ సూర్యవంశీ విధ్వంసం
### అండర్-19 ఆసియా కప్
### యూఏఈ టార్గెట్ 433 రన్స్



దుబాయ్, ప్రజాస్వరం
యూఏఈతో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో ఈ లెఫ్ట్ హ్యాండర్ అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 95 బంతుల్లోనే 171 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 భారీ సిక్సర్లతో పాటు 9 ఫోర్లు ఉండటం విశేషం. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత జట్టు భారీ స్కోరు వైపు దూసుకెళ్తోంది. దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన యూఏఈ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అసాధారణ ఆరంభాన్ని ఇచ్చాడు. కెప్టెన్ ఆయుశ్ మాత్రేతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన వైభవ్, ఆరంభం నుంచే యూఏఈ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి భారత్ 433 భారీ స్కోర్ సాధించింది.

# శివరాజ్ పాటిల్ కన్నుమూత



### కేంద్ర హెూం మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా సేవలు
### 26/11 ముంబై దాడుల తర్వాత నైతిక బాధ్యతతో మంత్రి పదవికి రాజీనామా
### ఏడుసార్లు లాతూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన అనుభవజ్ఞుడు

ముంబయి, ప్రజాస్వరం
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్ (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, మహారాష్ట్రలోని లాతూర్‌లో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో కీలక పదవులను అలంకరించిన శివరాజ్ పాటిల్, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు.1972లో లాతూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శివరాజ్ పాటిల్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. 1980లో తొలిసారి లాతూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికై జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటి నుంచి 1999 వరకు వరుసగా ఏడుసార్లు అదే స్థానం నుంచి ఎంపీగా గెలుపొంది రికార్డు సృష్టించారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాల్లో రక్షణ, వాణిజ్యం, శాస్త్ర సాంకేతికత, పౌర విమానయానం వంటి పలు కీలక శాఖలకు మంత్రిగా సేవలందించారు.
1991 నుంచి 1996 వరకు లోక్‌సభ స్పీకర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హయాంలోనే పార్లమెంట్ లైబ్రరీ భవన నిర్మాణం, లోక్‌సభ కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారం వంటి ముఖ్యమైన సంస్కరణలు జరిగాయి. 2004లో యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర హెూం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శివరాజ్ పాటిల్, 2008లో ముంబైలో జరిగిన 26/11 ఉగ్రదాడులకు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత 2010 నుంచి 2015 వరకు పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా కూడా ఆయన సేవలందించారు.

# జేఎన్టీయూలో కీచక ప్రొఫెసర్

### గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ లైంగిక దాడి
### ఉద్యోగం తీసేస్తానని బెదిరించి ఘాతుకం
### పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రొఫెసర్ అరెస్ట్



హైదరాబాద్ జేఎన్టీయూలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మహిళపై ఓ ప్రొఫెసర్ లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందిత ప్రొఫెసర్‌ను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరింపులకు గురిచేశాడు. తామిద్దరం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారం అని నమ్మించి, పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పని పేరుతో అర్ధరాత్రి వరకు తనతోనే ఉంచుకోవడంతో బాధితురాలి వైవాహిక జీవితంలో కలతలు రేగాయి. దీంతో భర్తకు దూరంగా ఆమె ఒంటరిగా జీవించడం ప్రారంభించింది. బాధితురాలు ఒంటరిగా ఉండటాన్ని అవకాశంగా తీసుకున్న ప్రొఫెసర్, శారీరకంగా, మానసికంగా మరింత వేధించడం మొదలుపెట్టాడు. తన ఛాంబర్‌లోనే ఆమెపై అత్యాచారయత్నం చేసినట్లు కూడా బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. రోజురోజుకూ వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించింది.